సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం

- పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

రాజానగరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధులు కావాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాజమహేంద్రవరం సంహిత డిగ్రీ కాలేజ్ కన్వెన్షన్ హాలులో నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన పార్టీ స్టీరింగ్ కమిటీ నాయకులు, ముఖ్యనేతలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కుల, మతాలు, పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వర్గాల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గత పాలకుల మాదిరిగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత మర్చిపోకుండా 99.5 శాతం మేరకు అమలు చేసిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదేనన్నారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్లి, వారిని చైతన్యపర్చడంతోపాటు ప్రతిపక్షాలు ఆడే ఓట్ల రాజకీయాలపై కూడా వారికి అవగాహన కలిగించాలన్నారు. రాబోయే ఎన్నికలలో ఎలాగైనా సరే అధికారంలోకి రావాలనే దురాశతో చంద్రబాబు అండ్ కో పనిచేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలలోనూ మనమే విజయం సాధించాలనే సంకల్పంతో జగనన్న తీసుకున్న లక్ష్యాన్ని సాకారం చేయడమే మన బాధ్యతగా చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు.


ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

దివాన్‌చెరువులో రూ.13.20 కోట్లతో అభివృద్ధి

మండలంలోని దివాన్ చెరువులో గడచిన నాలుగున్నరేళ్లలో రూ.13.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువులో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో కరపత్రాల ద్వారా వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈ గ్రామంలో అభివృద్ధి పనులకు కేవలం రూ.54 లక్షలే వెచ్చించారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకు రావాలని, సంక్షేమ పథకాలు కొనసాగేలా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, పలివెల స్వామి, యర్రంశెట్టి ధర్మరాజు, మార్గాని శ్రీను, పీటర్, వల్లభశెట్టి సత్యనారాయణ, ఆకుల శ్రీను, పాల్గొన్నారు.


దివాన్‌చెరువులో ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

పద్మశాలీల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు

పెదపూడి: పద్మశాలీల అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు తెలిపారు. సంపర గ్రామంలో ఇటీవల వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పప్పు సింహాచలానికి అభినందన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముక్తేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఏన్నడులేని విధంగా ఒక్క ముఖ్యమంత్రి జగన్ హయాంలోనే పద్మశాలీల అభివృద్ధి జరిగిందన్నారు. పద్మశాలీల జగన్‌కు అండగా నిలిచి రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. సన్మాన గ్రహీత పప్పు సింహాచలం మాట్లాడుతూ పద్మశాలీల అభివృద్ధి సంక్షేమం మరింత జరగాలన్నా, ఉన్నత స్థానాలు సాధించాలన్నా అందరం ఐక్యతగా జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తాను పార్టీకి, పద్మశాలీల సంఘానికి అందిస్తున్న సేవలకు గుర్తించి రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శిగా నియమించడం అభినందనీయమన్నారు. పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు మంత్రోచ్చారణతో సింహాచలానికి శాలువా కప్పి పూలమాలలు వేసి జ్ఞాపిక అందించి వైభవంగా సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీల సంఘం ప్రతినిధులు శెట్టి శివరామ్, పప్పు పైడియ్య, పప్పు జోగారావు, పప్పు శ్రీనివాసరావు, గోపి సురేష్, చింతకింద రాము, సూరిబాబు, పాపారాయుడు, విజయ కుమార్, నాగు, నీలం రాజు పాల్గొన్నారు.


సంపరలో సింహాచలాన్ని సన్మానిస్తున్న ముక్తేశ్వరరావు, పద్మాశాలీ సంఘం ప్రతినిధులు

ఆయిల్‌పామ్ రైతులకు న్యాయం చేస్తాం

రంగంపేట: ఆయిల్‌పామ్ సాగు రైతులకు గిట్టుబాటు ధర విషయంలో న్యాయం చేస్తామని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి అన్నారు. శనివారం రంగంపేట–వడిశలేరు గ్రామాల మధ్య ఏడీబీరోడ్డు పక్కన ఉన్న గన్ని వ్యవసాయ క్షేత్రం వద్ద జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆయిల్‌పామ్ సాగు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టన్ను పామాయిల్ గెలల ధర రూ.23 వేల నుంచి రూ.12400 లకు పడిపోయిన మాట వాస్తవమేనని, దీనిపై కనీస గిట్టుబాటు ధర కోసం తాము కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర పామాయిల్ రైతు సంఘం మాజీ అధ్యక్షుడు సత్తి రామారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా దిగుమతి సుంకాన్ని 40 శాతం నుంచి సున్నా శాతానికి తగ్గించడం వల్ల పామాయిల్ గెలల ధర సగానికి సగం తగ్గిపోయిందన్నారు. ఉమ్మడి జిల్లా పామాయిల్ రైతు సంఘం అధ్యక్షుడు పెండ్యాల బుజ్జిబాబు మాట్లాడుతూ కనీస ధరను టన్నుకు రూ.18 వేలు ప్రకటించాలన్నారు. రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు, డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడారు.


వినతిపత్రం అందిస్తున్న రైతు ప్రతినిధులు

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి


రామవరంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు, ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఉత్సాహంగా ఆసరా కార్యక్రమాలు

అనపర్తి: మహిళల ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పులుగుర్త, లక్ష్మీనరసాపురం, పెదపర్తి, రామవరం గ్రామాల్లో ఆసరా నాలుగో విడత కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

అనపర్తి: గ్రామ శివారు కొత్తూరు వెళ్లే దారిలో ఉన్న బరెల్ గ్రౌండ్ ప్రహరీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం భూమిపూజ చేశారు. పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో ఈ ప్రహరీ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పడాల కల్యాణ్‌రెడ్డి, మల్లిడి గోవిందరెడ్డి, మార్కెండేయపురం, వెంకటరత్నాపురం ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

ఫైలేరియా సర్వే తనిఖీ

బిక్కవోలు: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఊలపల్లి గ్రామంలోని ఫైలేరియా సర్వే పై జోనల్ మలేరియా అధికారి డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం గత నెల 19 తేదీన నుంచి గ్రామంలోని సుమారు 500 మందిని సర్వే చేశారు. ఈ సర్వే ఎలా జరిగిందని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

సీతానగరం: కూనవరం ఎంపీపీయూపీ స్కూల్ విద్యార్థులకు శనివారం ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. హెచ్ఎం పోలిమాటి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకర గంగారత్నం, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు అయిన చిన పాపారావు, అయిల మధు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. ట్యాబ్‌లను విద్యార్థులు చక్కగా ఉపయోగించుకోవాలని ఆకాంక్షించారు. హెచ్ఎం లక్ష్మణ్ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకలో 8వ తరగతి చదువుతున్న 26 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అయిల గాంధీ, అయిల రమేష్, సుంకర నరసింహరావు, మండపాక గణేష్, విద్యాకమిటీ చైర్మన్ నందూరి వీరభద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఊలపల్లిలో ట్యాబ్‌లు అందిస్తున్న నాయకులు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. శనివారం ఊలపల్లి గ్రామంలో ముల్లంగి బులి వీరన్న ఉన్నత పాఠశాల వద్ద ఎనిమిదో తరగతి విద్యార్థులు 61 మందికి ప్రభుత్వ ఉచిత ట్యాబ్‌లను వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటివద్ద ట్యాబ్‌లతో చదువుకోవాలన్నారు. సాంకేతిక అభివృద్ధికి తగ్గట్టుగా ప్రతి విద్యార్థి దానికి అనుకూలంగా ఎదగాలన్నాదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలోని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు బోకం లోవకుమారి, పాఠశాల హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కూనవరంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థినుల ఎంపిక

అనపర్తి: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థినులు ఎంపికై నట్టు ఆ పాఠశాల హెచ్ఎం కె.కల్యాణి తెలిపారు. ఒకే పాఠశాల నుంచి 15 మంది విద్యార్థినులు ఎన్ఎంఎంఎస్ ఎంపికై రికార్డు సృష్టించారన్నారు. ఎంపికైన విద్యార్థినులకు వరసగా ఐదేళ్లు ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని ఆమె తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో తమ ప్రతిభను చాటి పాఠశాల కీర్తిప్రతిష్టలు మరింత పెంచారని, వారికి అభినందనలు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థినులకు వరసగా ఐదు సంవత్సరాలు ఏటా రూ. 12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. విద్యార్థినులకు స్టడీమెటీరియల్ అందజేసి ప్రోత్సహించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బిక్కవోలు: మెళ్లూరు ఉన్నత పాఠశాలల్లో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం జి.లక్ష్మి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పాఠశాల చెందిన ఓపీఎస్‌వీ చక్రిశ్వర్, డీఎస్ఎస్ సుదర్శిని ఎంపికై నట్టు ఆమె తెలిపారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

బాల్యం నుంచీ ఆదర్శ పౌరులుగా ఎదగాలి

రంగంపేట: మానవతా విలువలు పాటిస్తూ బాల్యం నుంచి ఆదర్శ పౌరులుగా తయారుకావడానికి కృషి చేయాలని విశాఖ డెయిరీ మేనేజర్ ఎ.రవికుమార్ సూచించారు. స్థానిక తులసీ రెసిడెన్సీలో సత్యసాయి బాల వికాస్ కేంద్ర ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక, శారీరక ఒత్తిడిని నివారించడానికి యోగా, మౌన సాధన, ఆధ్యాత్మిక ఆటలు ఎంతగానో ఉపయోగపడతాయని, పిల్లలతో పాటు పెద్దలు కూడా దీనిని సాధన చేయడానికి కృషి చేయాలని, బాల వికాస్ తరగతులకు ప్రతి కుటుంబ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు. రెసిడెన్సీ అధ్యక్షుడు ఎస్.మురళీ మాట్లాడుతూ చదువు సంస్కారాన్ని నేర్పుతుందన్నారు. ఈ బాల వికాస్ కేంద్రాన్ని రంగంపేట సత్యసాయి సేవా సంస్థల సబ్‌జోన్ కన్వీనర్ మలిరెడ్డి వీర్రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా, బాల వికాస్ శిక్షణా తరగతిని బాల వికాస్ జిల్లా విద్యా విభాగ సమన్వయ కర్త ఎల్.శ్రీనివాసరాజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక, ఏకాగ్రత ఆటను నిర్వహించి విజేతలకు బహుమతులు నిర్వహించారు.

గడ్డి ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని పెదమాకవరం సమీపంలో శనివారం గడ్డి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న యజమాని సీహెచ్ నాగేశ్వరరావు (45) మృతి చెందాడు. కాకినాడకు సమీపంలో పెదపూడికి చెందిన ఆయన ఏటా ట్రాక్టర్‌తో వరి నూర్పిడి పనుల నిమిత్తం ఈ ప్రాంతానికి వస్తుంటారు. దీనిలో భాగంగానే మండలానికి వచ్చిన ఆయన శనివారం ట్రాక్టర్‌తో వరి నూర్పిడిని పూర్తి చేశారు. అనంతరం ట్రాక్టర్‌పై గడ్డిని తీసుకువెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడడంతో దాని కింద ఇరుక్కుపోయి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించినట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందని సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, రామేశ్వరం గ్రామ సర్పంచి కొటికలపూడి చినబాబు అన్నారు. ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ఏపీత్రయం గ్రామానికి చెందిన బాలురు, బాలికల విభాగాల్లో ఖోఖో జట్లు నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించి జిల్లా జట్టుకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా క్రీడాకారులకు అభినందన సభ గ్రామంలో శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొటికలపూడి చినబాబు మాట్లాడుతూ క్రీడలతో ఉన్నత భవిష్యత్ ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే క్రీడలతో క్రీడాకారులు మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం క్రీడాకారులకు ట్రోఫీ, మెడల్స్, ఇతర బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఈటీపీఆర్డీ ఎంసత్యనారాయణరెడ్డి, స్థానిక సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, సర్పంచి అడబాల అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తు వేగవంతం

రంగంపేట: పాత వీరంపాలెం గ్రామ శివారు జీడిమామిడి తోట వద్ద కాలిపోయిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం తెల్లవారు జామున స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన సంగతి విదితమే. అయితే ఈ కేసు పలు అనుమానాలకు తావిస్తుంది. మృతి చెందిన వ్యక్తి ఎవరు, చంపిన వ్యక్తులు ఎవరు, ఎక్కడో హత్యచేసి ఇక్కడకు తీసుకువచ్చారా, ఇక్కడే చంపి పెట్రోల్ పోసి తగులబెట్టారా అనే అంశాలపై రాజమహేంద్రవరం డీఎస్పీ ఎం. కిషోర్‌కుమార్, అనపర్తి సీఐ పి.శివగణేష్, రంగంపేట ఎస్సై పి.విజయ్ కుమార్ దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జీడిమామిడి తోట యజమాని పూసయ్య చెబుతున్న మాటలు పొంతన లేకపోవడంతో సెల్‌ఫోన్ సంభాషణల ఆధారంగా కేసును పలు కోణాల్లో విచారిస్తున్నారు.

కాపర్ వైరు చోరీపై కేసు

బిక్కవోలు: కాపర్ వైరు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ చెందిన గమ్మెల్ల వెంకటరావుకు రంగాపురం గ్రామంలోని 3.5 ఎకరాలు పామాయిల్ తోట ఉంది. దానిని సింగంపల్లి గ్రామానికి చెందిన వీర వెంకట రమణ చూసుకుంటున్నారు. అయితే ఈ నెల 26 తేదీ రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్లను దొంగలించిపోయారని, దాని విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శలు


బాధితులను పరామర్శిస్తున్న విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం బుచ్చెంపేటలో పలువురిని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి శనివారం పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన తాతారావు, ఎస్.సుబ్రహ్మణ్యం, కోనాల సీతారత్నం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గంగరాజును పరామర్శించారు. డయాలసిస్ చేయించుకుంటున్న అడబాల తిరుపతిరావుకు వైద్యసహకారం అందిస్తామన్నారు.

సామూహిక సత్యవ్రతాలు

సీతానగరం: స్థానిక శ్రీసత్యసాయి మందిరం 25వ వార్షికోత్సవం సందర్భంగా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం సత్యవ్రతాలు నిర్వహించారు. కాకినాడకు చెందిన రఘుపతి మాస్టారు సుమారు 250 మంది భక్తులతో వీటిని చేయించారు. గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో భజనలు చేసే భజన సంఘాలను ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సత్యసాయి నామ సంకీర్తన

రంగంపేట: సత్యసాయి నామ సంకీర్తన ప్రతి ఇంటా నిర్వహించాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్‌నాథ్ సూచించారు. కోటపాడులో సత్యసాయి లక్ష గృహ నామ సంకీర్తన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి భక్తులనుద్దేశించి మాట్లాడారు. బాబా పాదుకలకు, చిత్ర పటానికి అష్టోత్తర పూజలు, నామ సంకీర్తన చేశారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం

రాజానగరం: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.త్రినాథ్ బాబా ఆధ్వర్యంలో దివాన్ చెరువులో శనివారం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బండి ధర్మరాజు, ఆర్.సుబ్రహ్మణ్యం, అదనపు కార్యదర్శిగా బి.కామేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎ.వీరబాబు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా శైలజా భవాని, ఎస్‌జే త్రినాథ్, పీవీవీ భీమేశ్వరరావు, ఆర్థిక కమిటీ సభ్యుడిగా డి.సూరిబాబు నియమితులయ్యారు.

అభినందనలు

రాజానగరం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముక్కినాడ గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న యర్రగుంట నాగదుర్గాప్రసాద్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారని ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అనదాస సాయిరామ్ తెలిపారు. పంచాయతీ రాజ్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని రాజమహేంద్రవరంలో అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను అభినందించారు.

ముగిసిన క్రీడాపోటీలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారన్నారు. ఇక్కడి విజేతలు డివిజన్ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

బాలిక అదృశ్యం

సీతానగరం: చినకొండేపూడికి చెందిన బాలిక కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ శనివారం తెలిపారు. ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. దీనిపై ఆమె తండ్రి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

సీతానగరం: మండలంలోని మునికూడలికి చెందిన రాయి నాగదేవి ఫిర్యాదు మేరకు కట్నం వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ శనివారం తెలిపారు. మునికూడలికి చెందిన నాగదేవికి కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన విజయ్ కుమార్‌తో 2017లో వివాహమైంది. ఆరు నెలలు కాపురం సజావుగా సాగింది. ఈ తర్వాత నుంచీ కట్నం కోసం నాగదేవిని విజయ్ కుమార్ వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బాధ్యతల స్వీకరణ

బిక్కవోలు: గ్రామంలోని శ్రీలక్ష్మీ గణపతి స్వామి దేవస్థానం జూనియర్ అసిస్టెంట్‌గా కోళ్ళ వీర కుమార్(రవి) బాధ్యతలు స్వీకరించారు శనివారం దేవస్థానం ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం బదిలీపై ఈ ఆలయానికి వచ్చారు.

పౌష్టికాహారం పంపిణీ

బిక్కవోలు: కొంకుదురు పీహెచ్‌సీ పరిధిలోని టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. టీబీ ముక్త భారత్ అభిమాన్ కార్యక్రమంలో భాగంగా పవర్ గ్రిడ్‌సంస్థ ఆరుగురు రోగులకు పౌష్టికాహార కిట్లను అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి పాల్గొన్నారు.